సంక్షిప్తం

పేటలో హైదారాబాద్ ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్‌కు గ్రీన్‌సిగ్నల్

నాయుడుపేటటౌన్: హైదారాబాద్‌-చెన్నై ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 19వ తేదీ నుంచి నాయుడుపేటలో స్టాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్టు సదరన్ రైల్వే అధికారులు తెలిపారని స్థానిక సదరన్ రైల్వే ప్రయాణికుల అసోసియేషన్ అధ్యక్షులు మస్తానయ్య గురువారం తెలిపారు. తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి చొరవతో స్టాపింగ్ సౌకర్యం పునరుద్ధరించారని చెప్పారు. 19న ఉదయం 3.28 ఇక్కడ ఆ రైలు ఆగుతుందని తిరిగి 3.30 గంటలకు చెన్నైకు బయలు దేరుతుందని తెలియజేశారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

సైదాపురం: వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే వారు విగ్రహాల ఏర్పాటుకు తప్పని సరిగా అనుమతి పొందాలని సైదాపురం ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. వీధుల్లో విగ్రహ ప్రతిష్ట, ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ఇత్యాది వాటికి సంబంధించి విగ్రహాల కమిటీలు తొలుత సింగిల్ విండో విధానంతో అనుమతులు పొందాలని, విగ్రహం, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ట, నిమజ్జనం ఎక్కడ చేస్తారు, ఏ వాహనంలో తరలిస్తారు..అలాగే ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లతో వివరాలు నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వడిబాల బియ్యం పంపిణీ

చిల్లకూరు: గూడూరు బజారువీధిలోని వాసవి కన్యాకపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాస ప్రత్యేక పూజల్లో భాగంగా గురువారం అమ్మవారి వడిబాల బియ్యాన్ని మహిళలకు పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు వాసవి మహిళా సమాజ సభ్యులతో అమ్మవారి సహస్ర నామార్చన చేయించారు.

తూపిలిపాళెం బీచ్‌ను పరిశీలించిన డీఎస్పీ

వాకాడు: ఈ నెల 27 నుంచి 9 రోజులుపాటు వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి గురువారం గూడూరు డీఎస్పీ గీతాకుమారి మండలంలో తూపిలిపాళెం సముద్ర తీరంలోని మొదటి ఘాట్, రెండో ఘాట్ ప్రాంతాలను పరిశీలించారు. నిమజ్జనాల నిమిత్తం వచ్చే భక్తులకు సముద్ర తీరంలో మెరుగైన సేవలు, తగిన భద్రత కల్పిస్తామని ఆమె చెప్పారు.

డాక్టర్ రవికుమార్ హఠాన్మరణం

కోట: కోటలో ప్రముఖ వైద్యునిగా గుర్తింపు పొందిన డాక్టర్ రవికుమార్ (58) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన గూడూరు ఏరియా హాస్పిటల్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. ఆయనపై మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

రాపూరు: రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం 90 మంది విద్యార్థులకు కంటి వైద్య నిపుణులు గురవయ్య వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 12మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఎన్ఎస్ఎస్ అధికారి సాయికిరణ్, వైద్య సిబ్బంది సురేఖ, నారాయణమ్మ,కవిత, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

వాకాడు/చిల్లకూరు: వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాళెం, చిల్లకూరు మండలం వరగలి పీహెచ్‌సీలో గురువారం తిరుపతి స్విమ్స్ వైద్య బృందం ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించింది. పింక్ బస్సుల్లో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజు, నోడల్ ఆఫీసర్లు ప్రత్యూష, ఎం.లలిత, బాలిరెడ్డిపాళెం, వరలగి వైద్యాధికారులు కమలశ్రీ, పాల్ జాన్సన్, ప్రసన్నరాణి, స్విమ్స్ మెడికలాఫీసర్లు హరిత, వైద్య సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక విజ్ఞప్తుల దినంలో వినతుల వెల్లువ

చిట్టమూరు: మండలంలోని మల్లాం-1, 2 గ్రామ సచివాలయాల్లో గురువారం ఎంపీడీఓ మనోహర్ గౌడ్ ప్రత్యేక విజ్ఞప్తుల దినం నిర్వహించారు. వివిధ సమస్యలపై పలు వినతులు స్వీకరించారు. పింఛన్లు రావడం లేదని 36 మంది, తమ పిల్లలకు తల్లికి వందనం మరో నలుగురు, అన్నదాత సుఖీభవ నగదు తమకు రాలేదని ముగ్గురు రైతులు వినతి పత్రాలు ఇచ్చారు.. అలాగే నూతన రేషన్ కార్డులు ఇవ్వాలని, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి సంబంధించి తమ బ్యాంకు ఖాతాలో నగదు జమకాలేదని వినతి పత్రాలు అందజేశారు. అర్జీలను పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మినీ ట్రక్కు డ్రైవర్లు, యాజమానుల ఆందోళన


ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ, కమిషనర్

నాయుడుపేటటౌన్: తమ వాహనాలు నిలుపుకునే స్థలంలో మున్సిపల్ అధికారులు దుకాణాల నిర్మాణానికి పూనుకోవడాన్ని నిరసిస్తూ మినీ ట్రక్కు వాహనాల డ్రైవర్లు, యాజమానులు గురువారం ఆందోళన చేశారు. వివరాలు.. పట్టణంలో పాత బస్టాండు వద్ద ఎన్నో ఏళ్లుగా ఉంటున్న నక్కలోళ్ల దుకాణాలను తొలగించడంతో వారంతా పాత బస్టాండు సమీపంలో ప్రధాన వీధిలోని డివైడర్లపై దుకాణాలు పెట్టుకుని అక్కడే నివాసాలు ఉంటున్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ నక్కలోళ్ల సమస్యలపై సమస్యపై స్పందించారు. నిధులు మంజూరు చేయడంతో వారికి ఆర్టీసీ బస్టాండు సమీపంలో వైఎస్సార్ సర్కిల్ వద్ద రహదారి పక్కనే 12 దుకాణాలను నిర్మించేందుకు మున్సిపల్ అధికారులు గురువారం ఉపక్రమించారు. అయితే ఆ స్థలం వద్ద తమ వాహనాలు నిలుపుకుంటున్నామని, ఇక్కడ దుకాణాలు నిర్మించరాదంటూ మినీ ట్రక్కు వ్యాన్ల డ్రైవర్లు, యజమానులు ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న సీఐ బాబి, కమిషనర్ షేక్ ఫజులుల్లా, తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. వారు ససేమిరా అనడంతో బలప్రయోగంతో వాహనాలు ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరో చోట వాహనాలను నిలుపుకునేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు


హోమాలు చేస్తున్న వేద పండితులు

సైదాపురం: మండలంలోని తోకలపూడిలో గ్రామ దేవతలైన యామాలమ్మ, గంగమ్మ నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన, మహా కుంభాభిషేకానికి గురువారం శ్రీకారం చుట్టారు. వేదపండితులు తొలుత మూలమంత్ర హోమాలు చేసిన అనంతరం విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. శుక్రవారం ఉదయం 8:27 గంటలకు నూతన విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్టు చెప్పారు. భక్తులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడొద్దు

గూడూరు రూరల్: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని ఒకటో పట్టణ ఎస్ఐ తిరుపతయ్య హెచ్చరించారు. గూడూరులోని లయోలా జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు..


మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేటటౌన్: విద్యార్థినులు ఆపద సమయాల్లో ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. స్థానిక లోతు వానిగుంట కాలనీ వద్ద ఉన్న ఎస్సీ బాలికల1, 2 వసతి గృహాల్లో 9, 10వ తరగతుల విద్యార్థినులకు తైక్వాండో కోచ్ పవన్‌కుమార్‌తో పది రోజుల పాటు డీఎస్పీ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ శిక్షణ స్వీయ రక్షణకు వినియోగించుకోవాలని కోరారు. సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి 'శక్తి యాప్'పై అవగాహన కల్పించారు. సూళ్లూరుపేట ఏఎస్‌డబ్ల్యూ లక్ష్మీరాజ్యం, వార్డెన్లు సరిత, ఉమా తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వరి మృతి పార్టీకి తీరనిలోటు


రాజేశ్వరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి, డక్కిలి జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి మృతి చెందడం తమ పార్టీకి తీరని లోటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని కలిమిలి నివాసానికి వెళ్లి గురువారం రాజేశ్వరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు.కలిమిలి కుటుంబాన్ని పరామర్శించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేదురుమల్లిని కలిసిన నేతలు

వెంకటగిరి(సైదాపురం): పట్టణంలోని నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి బంగ్లా వద్ద గురువారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని కలిశారు. వివిధ ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ ప్రసాద్‌రెడ్డి , వైస్ చైర్మన్ శాతరాసి బాలయ్య, విప్ పూజారిలక్ష్మి, రాష్ట్ర నాయకుడు సదారెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, కౌన్సిలర్లు ఆవిశంకరయ్య, ధనియాల రాధ, సుబ్బారావు, సుకన్య, సుభావలి, ఆటంబాక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు,

రాజాలతో నేదురుమల్లి భేటీ

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం పట్టణంలోని రాజా ప్యాలెస్‌లో వెంకటగిరి రాజా కుటుంబీకులు, ఎస్వీబీసీ మాజీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర, స్వరజ్ఞ కుమార యాచేంద్రలను మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ అంశాలపై చర్చించారు.

గాడ్ బ్లెస్ యూ..!


వధూవరులను ఆశీర్వదించిన రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: వాకాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నెల్లిపూడి భాగ్యరాజ్ సోదరుడు నెల్లిపూడి రాజశేఖర్ వివాహం గురువారం స్థానిక సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చిలో జరిగింది. వివాహానికి వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హాజరై నూతన వధూవరులు రాజశేఖర్, జాస్మిన్‌ను ఆశీర్వదించారు.

గంధోత్సవం


దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మత గురువులు

గూడూరు రూరల్: గూడూరులోని హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా గంధోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మతగురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తమిళనాడు ఫకీర్ల జరాబు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సినీ నటుడు చలపతి దర్గాను సందర్శించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. దర్గా వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, గౌరవాధ్యక్షుడు లయన్ షేక్ రియాజ్ అహ్మద్, మగ్దూమ్, షానవాజ్, సంధాని బాషా, గోల్డెన్ గౌస్, షబ్బీర్, యస్దాని తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊంచా రహే హమారా..!


చిల్లకూరు: గూడూరు టవర క్లాక్ వద్ద ..



విద్యానగర్‌లో ర్యాలీ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, వెంకటగిరిలో...

చిల్లకూరు: దేశ భక్తిని చాటేలా విద్యార్థులతో గూడూరులో గురువారం భారీ జాతీయ పతాకంతో పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వివేకానంద కోచింగ్ సెంటర్ నిర్వాహకులు పలు పాఠశాలల విద్యార్థులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. జెండా ఊరేగింపు అనంతరం టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, గూడూరు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది ప్రాణత్యాగం చేశారని, వారి స్ఫూర్తితో ముందుకుపోవాలన్నారు. కోచింగ్ సెంటర్ ప్రతినిధి మల్లికార్జున్, పట్టణ సీఐ శేఖర్‌బాబు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు: దేశభక్తిని చాటుతూ రాపూరులోని జెమ్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలు విద్యార్థులు గురువారం 150 అడుగుల జాతీయ పతాకంతో పురవీధులో ర్యాలీ చేశారు. చిన్నారులు స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణతో ఆకట్టుకున్నారు. ఎంఈఓలు శ్రీనివాసులు, జిలాని, సీఐ సత్యనారాయణ, కరస్పాండెంట్ మునీంద్రరెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాపూరులో 150 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న చిన్నారులు

ఎన్‌సీసీ క్యాడెట్ల తిరంగా ర్యాలీ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు స్వాతంత్ర్య దిన సంబరాల్లో భాగంగా గురువారం కళాశాల నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు.ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ రాజేష్, ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి రూరల్ :ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తులసి జ్యోతి ఆధ్వర్యంలో గురువారం ఎన్‌సీసీ క్యాడెట్లు పాఠశాల నుంచి క్రాస్‌రోడ్డు వరకు భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. టీచర్లు జి.రవి, నయాబ్, సుబేదార్, రాజ్‌పాల్ యాదవ్, నాయక్, పోనం సోపాల్ పాల్గొన్నారు.

నేడు అల్లూరి స్టేడియంలో స్వాతంత్ర్య దిన సంబరాలు

చిల్లకూరు: గూడూరులోని అల్లూరి ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించేందుకు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఏర్పాట్లు చేశారు. పెద్దసంఖ్యలో ఆహుతులు ఆశీనులై, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రశంసా పత్రాల ప్రదానం తిలకించేలా ఏర్పాట్లు చేశారు.